క్లుప్తంగా

ఆత్మీయ సన్మానం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని దాదాస్ సంస్థ అధినేత పీఎం రవికుమార్ బాబు ఇటీవల అంబేడ్కర్ రత్న అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర అధ్యక్షుడు కె.రామాంజనేయులు, దళిత మిత్ర నాయకులతో కలిసి బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో అవార్డు గ్రహీత రవికుమార్‌ను శాలువ, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళితమిత్ర జిల్లా అధ్యక్షుడు పసుపుల మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నెపాటి వెంకట రమణ, అబ్బవరం నాగేశ్వరరావు, పసుపుల బాల ఓబయ్య, ఊటుకూరు బాలాజీ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

22 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న మాధవరెడ్డి

వైవీయూ : బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరం చెన్నూరు బస్టాండు వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో 22 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యాపారవేత్త రిలయన్స్ మాధవరెడ్డి మాట్లాడుతూ వేసవిలో రక్తకొరత ఉంటుందని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తానుకూడా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్, సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సీఆర్ఐ సునీల్ జయంత్, రిమ్స్ బ్లడ్ బ్యాంకు అధికారి డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

వైవీయూ : ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా నాటడంతో పాటు వాటి పరిరక్షణను చూసుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నగరంలోని నిరంజన్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపునకు విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. అంకాల్ నాగరాజు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అందిస్తున్న సేవలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యాశాఖ వైఫల్యం వల్లే ఇన్ని లోపాలు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ అధికారులు తనిఖీల్లో బయటపడ్డ లోపాలన్నీ విద్యాశాఖ వైఫల్యం వల్లే జరిగాయని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ చేసిన తనిఖీల్లో అన్ని పాఠశాలల్లోను సమస్యలు బయటపడ్డాయని దీనికి కారణం విద్యాశాఖే అని ఆయన ఆరోపించారు.ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రాజా



కడప రూరల్ : ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఆర్ఎస్ రాజా నియమితులయ్యారు. తన నియామకంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు.. మాదిగల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

3 నుంచి శ్రీలక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే నెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆలయ ధర్మకర్త తెలిపారు. ఆలయ అవరణలో ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు, కోనేర్లలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు.

సమాజ సేవలో 'మేము సైతం'

కడప అర్బన్: కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జెడ్పీ సమీపంలో నిర్జీవంగా పడివున్న బాలాజీ (70) అనే వృద్ధుడిని నాలుగురోజుల క్రితం స్థానికులు 108 ద్వారా రిమ్స్‌లో చేర్పించారు. ఆయన కోలుకోలేక ఈనెల 23న మృతి చెందాడు. అతనికి సంబంధించిన వారెవరూ రాకపోవడంతో అంత్యక్రియల కోసం మేము సైతం సేవాసంస్థ వారికి వన్‌టౌన్ పోలీసులు విన్నవించారు. సాంప్రదాయం ప్రకారం మేము సైతం వారు వచ్చి దహనసంస్కారాలు నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గుండ్లకొండ రవి, అయ్యవారయ్య, రామలోకం, రెడ్డెయ్య, భానుప్రకాష్ పాల్గొన్నారు.

'గడప గడప'లో అపూర్వ ఆదరణ


తురకపల్లెలో అవ్వకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మండలం నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. బుధవారం మండల పరిధిలోని తురకపల్లెలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.అనంతరం గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ, ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అంతకు ముందు అగస్తలింగాయపల్లెలో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా ఏ సీఎం చేయని విధంగా జగనన్న సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై పూర్తి ఫోకస్ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన 46 నెలల్లో జగనన్న విద్యారంగ సంస్కరణలపై రూ.58,555 కోట్లు ఖర్చు చేశారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలే మార్చేశారన్నారు. జగనన్న వసతి దీవెన ద్వారా ఇప్పటి వరకు రూ.4276 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. అలాగే డిజిటల్ విద్య దిశగా అడుగులు వేసిన ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడా ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. ప్రతి వర్గానికి పథకాలు ప్రవేశ పెట్టిన జగనన్నను మరో సారి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ హైమావతిచంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రియాకంమల్లికార్జున రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, శివ కిషోర్‌రెడ్డి, ఈశ్వర్ కొండారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆంజనేయరెడ్డి, గంగిరెడ్డి, శివారెడ్డి, రామలక్ష్మీరెడ్డి, లక్ష్మీకొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి, రమణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలి


డీఈఓ రాఘవరెడ్డికి వినతిపత్రమిస్తున్న నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని శంకరాపురంలో ఉన్న స్కౌట్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం(రీజనల్ ట్రెయినింగ్ సెంటర్)అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డిని జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలోని స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు స్కౌట్ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న భవనాలు కూలిపోయే దశలో ఉన్నందున నూతన భవనాల నిర్మాణానికి, సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, లగిశెట్టివాండ్లపల్లె స్కూల్ స్కౌట్ యూనిట్ ప్రధానోపాధ్యాయులు వంగమల్ల వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో రాజకీయాలను నియంత్రించాలి

వైవీయూ : విశ్వవిద్యాలయాల్లో, ఉన్నతవిద్యలో పెరుగుతున్న రాజకీయాలను, అనవసర జోక్యాలను నియంత్రించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. బుధవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యను కలిసి ఏబీవీపీ నాయకులు వినతిపత్ర అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో వేడుకలు, పుట్టినరోజులు, విజయోత్సవాలు నిర్వహించడం సరికాదన్నారు. జీఓనెంబర్ 77 రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్, విశ్వవిద్యాలయ కార్యదర్శి వెంకటేష్, సోమశేఖర్, సురేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ గణితవేత్త రామానుజన్


శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: ప్రపంచం గర్వించదగ్గ గణితవేత్త, మేధావి శ్రీనివాస రామానుజన్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీనివాస రామానుజన్ వర్ధంతి సందర్భంగా బుధవారం డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 20వ శతాబ్దంలో ప్రపంచఖ్యాతి పొందిన గణితమేధావుల్లో రామానుజన్ ఒకరన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, గణిత శాస్త్ర అధ్యాపకులు ఇ.సి. సుప్రియ, సునీలరాణి, అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, వై. మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ విజేతలకు అభినందన

కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ -22 పోటీల్లో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. తడిచెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ హటావో.. దేశ్‌బచావో.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై కళాశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి విజేతలుగా నిలిచారు. యూజీస్థాయిలో విశ్వవిద్యాలయ విద్యార్థులు విజేతలుగా నిలవడం పట్ల బుధవారం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్‌వర్ధన్, కల్చరల్ ఈవెంట్ కో–ఆర్డినేటర్ డా. పరమశివం, ఫొటోగ్రఫీ విభాగం కో–ఆర్డినేటర్ ఎం.ఆర్.సి. సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సులు నిలిపేయాలన్న నిర్ణయం తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రీయ విద్యాలయానికి రాబోయే విద్యా సంవత్సరంలో ఆర్టీసీ బస్సులు నిలిపి వేస్తామన్న నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించుకోవాలని కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రుల సంఘం బుధవారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు వినతిపత్రమిచ్చింది. 2014 నుంచి కేవీకి ఆర్టీసీ బస్సును నడుపుతోందన్నారు. విద్యార్థులు ఏటా వెయ్యి బస్సు పాసులు తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు బస్సులు నిలిపివేస్తే విద్యార్థుల చదువులు ఏం కావాలని ప్రశ్నించారు. సెంట్రల్ సిలబస్ చదివే అవకాశాన్ని పేద, మధ్యతరగతి విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ కేవీకి బస్సులు కొనసాగించాలని కోరుతూ ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు లేఖలు రాస్తానని తెలిపారు. కేవీ తల్లిదండ్రుల సంఘం నాయకులు జితేంద్ర, కరుణాకర్, సంజీవరెడ్డి, లక్ష్మీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి యాక్టివా 125 హెచ్ స్మార్ట్ వాహనం


యాక్టివా 125 హెచ్ స్మార్ట్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న హోండా కంపెనీ ప్రతినిధులు

కడప కార్పొరేషన్ : హోండా ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన హోండా 125 హెచ్ స్మార్ట్ వాహనం కడప మార్కెట్‌లోకి విడుదలైంది. కడప నగరంలోని చిన్నచౌకులో ఉన్న అమోఘా హోండా షోరూంలో బుధవారం ఈ వాహనాన్ని ఆ కంపెనీ సేల్స్ ఇన్‌చార్జి లతా ప్రసాద్, ఏపీ జోనల్ మేనేజర్ శరద్ ఉద్రే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోండా కంపెనీ అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ స్మార్ట్ టెక్నాలజీని వినియోగిస్తోందన్నారు. హెచ్ స్మార్ట్ వాహనంలో స్మార్ట్ అన్‌లాక్, స్మార్ట్ స్టార్ట్, స్మార్ట్ సేఫ్ కలిగి ఉందన్నారు. మొదటి రోజు 5 వాహనాలను డెలివరీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ జనరల్ మేనేజర్ మల్లికార్జున, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

బాబు తీరుపై మైనార్టీల ఆగ్రహం

కడప కల్చరల్ : బీజేపీ తీరుతో చంద్రబాబు ఏకీభవించడంపై ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కడప నగరం ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు తన్వీర్ అహ్మద్ తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి నరేంద్రమోదీని పొగడ్తలతో ముంచెత్తడం, ఆయన విజన్‌ను పొగుడుతూ ఏకీభవించడం సరికాదన్నారు. ఇటీవల తెలంగాణలోని ఓ బహిరంగసభలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లను తొలగిస్తామని అమిత్‌షా చెప్పారని, కర్ణాటకలో ఇప్పటికే ఆ పనిచేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ ముస్లింలపై విద్వేషాన్ని రగిల్చి రాజకీయ లబ్ధి పొందుతున్న బీజేపీ విజన్‌తో చంద్రబాబు ఏకీభవిస్తున్నామని ప్రకటించడం వెనుక అంతరార్థం ముస్లిం మైనార్టీలకు స్పష్టమైందన్నారు. మోదీ కటాక్షం కోసం బాబు ఎదురు చూస్తున్నారని, ప్రజలు ఆయనను నమ్మబోరని స్పష్టం చేశారు.

మూవీ స్టూడియో ప్రారంభం


కార్నివాల్ మూవీ స్టూడియోను ప్రారంభిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని పెద్ద ముసల్‌రెడ్డి పల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కార్నివాల్ మూవీ స్టూడియో బుధవారం ప్రారంభమైంది. కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ప్రజల అభిరుచి మేరకు ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్‌లు చేయడానికి సువిశాలమైన వాతావరణంలో మూవీ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎన్. ప్రసాద్‌రెడ్డి, రాణాప్రతాప్, జ్యోతి, ప్రొప్రైటర్లు కార్తీక్, మహేష్, పి. సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధ్యక్షతన జరగనుంది. ఈ విషయాన్ని ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

డార్విన్ సిద్ధాంతం కొనసాగించాలి

కడప కల్చరల్ : జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్ణయాన్ని పునః సమీక్షించి దాన్ని పాఠ్యాంశాలలో యథావిధిగా కొనసాగించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ కోరారు. ఈ మేరకు బుధవారం సంస్థ సభ్యులతో కలిసి అంబేడ్కర్‌సర్కిల్‌లో బ్యానర్‌ను ప్రదర్శిస్తూ కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం పదవ తరగతి నుంచి తొలగించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 11, 12 తరగతుల్లో సైన్స్ అంశాన్ని కొద్దిమంది విద్యార్థులే తెలుసుకుంటారని, అందువల్ల ఎక్కువమంది విద్యార్థులు ఈ కీలకమైన విషయాన్ని తెలుసుకోలేక పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి షమీర్‌బాష, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం, విద్యా విభాగం కన్వీనర్ రూత్ ఆరోగ్యమేరి, కిరణ్‌కుమార్, కామేశ్వరమ్మ, వెంకట్రామరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వినాశకర నిర్ణయాలు సరికాదు

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడపజిల్లా సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ హెచ్చరించారు. ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం రెండవరోజు కలెక్టరేట్ వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఇలియాస్ బాషా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఉపాధ్యాయలను మాత్రమే టార్గెట్ చేస్తూ సందర్శనలు సాగిస్తున్నారని ఆరోపించారు. యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రుతు ఆరోగ్యమేరీ, సుజాతరాణి, విశ్వనాథ శ్రీనివాసులు, దావుద్దీన్ కరీముల్లా, గోపీనాథ్, మస్తానయ్య, రాజేంద్ర, సుబ్రమణ్యం,దేవదత్తం,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ రైతు భరోసాకు అర్హులయిన రైతులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు 1బీ, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని కడప మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆదే విధంగా పీయం కిసాన్ లబ్ధిదారులు కూడా ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈకేవైసీ కోసం ఆధార్‌లింక్ అయిన మొబైల్ నెంబర్‌ను తీసుకుని వ్యవసాయశాఖ కార్యాలయంకానీ, మీసేవ కేంద్రం దగ్గర కానీ పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో సురేష్‌రెడ్డి తెలిపారు.

మేడేను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. బుధవారం కడప రైల్వే స్టేషన్ వద్దగల గూడ్స్ షెడ్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకుండా కార్మికులు అడ్డుకోవాలన్నారు. హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే మేడేను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడ్స్ షెడ్ హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, మహబూబ్‌బాష, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఏఐటీయూసీ నగర సమితి ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న సంస్థలను అమ్మడం... అసంఘటిత కార్మిక రంగంలోని కార్మికులను హరించే విధంగా చట్టాలు చేయడం సరికాదన్నారు. ఎనిమిది గంటల పని దినాల విధానంలో 12 గంటలు తీసుకువచ్చి కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మార్చడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ నాయకులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, మద్దిలేటి, తారక రమారావు, తదితరులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌లో ఘనంగా ఈద్ మిలాప్


మాట్లాడుతున్న కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు ఖాజా మొహిద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ఆల్ మేవా కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కడపలోని పాత కలెక్టరేట్ ఆవరణలోని ఆల్ మేవా కార్యాలయంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జలీల్‌ఖాన్ మాట్లాడుతూ సమాజంలో సోదరభావం, మానవ నైతిక విలువలు, దైవ భీతి ఏర్పడి సన్మార్గంలో నడవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సృష్టిలో మానవులు అందరు సమానమేనని.. ఒకరినొకరు ప్రేమాభిమానాలతోపాటు, సమ భావం కలిగి ఉండాలని తెలియచేశారు. మరో అతిథి కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఖాజా మొహిద్దీన్, ఆల్ మేవా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హబీబుల్లా మాట్లాడారు. ఈద్ మిలాప్ సందర్భంగా ఏర్పాటు చేసిన అల్పాహారం, సీట్లు, పండ్లు అతిథులందరికీ అందజేశారు. రాష్ట్ర, జిల్లా నాయకులు సనావుల్లా, ఫక్రుద్దీన్, మౌలాలి, ఖాదర్‌హుస్సేన్, ఇలియాస్ బాషా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జీతాలు, కూరగాయల బిల్లులు చెల్లించాలి


ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రమిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు, కూరగాయల బిల్లులు, ఇన్సెంటివ్స్, సీబీ ఈవెంట్ బిల్లులు మంజూరు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గంగావతి కోరారు. కడప ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లు చేస్తామని గతంలో చెప్పారన్నారు. అలాగే సర్వే కూడా నిర్వహించారన్నారు. సంపూర్ణ పోషణలో భాగంగా పాలకు ఫింగర్ ప్రింట్ లేకుండా నేరుగా అంగన్వాడీ సెంటర్లకే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సేవలు ప్రశంసనీయం


హెల్త్ కిట్లను అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, బ్యాంకు అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : మహిళాభివృద్ధి, సాధికారత సాధనలో భాగంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చేపట్టిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ విజయరామరాజు ప్రశంసించారు. బుధవారం యూనియన్ బ్యాంకు ఫీల్డ్ జీఎం అండ్ ఎస్ఎల్‌బీసీ కంట్రోలర్ నవనీత్ కుమార్, జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లు కలెక్టర్ విజయరామరాజును కలిసి రూ. 1.50 లక్షలు విలువజేసే 25 హెల్త్ చెకప్ పరికరాల కిట్లను ఆయన చేతుల మీదుగా మెప్మా హెల్త్ రీసోర్స్ పర్సన్లకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ప్రవేశపెట్టిన 'ఎంపవర్ హర్' పథకం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు మహిళల సామాజిక ఎదుగుదల, ఆరోగ్య సంరక్షణ కోసం వారు చేస్తున్న సేవ మహిళా సంఘ సభ్యులకు ఆరోగ్య భరోసా అందిస్తుందన్నారు. ఈ కిట్ల ద్వారా 50–60 సంవత్సరాల వయస్సుగల మహిళలకు బీఎంఐ, బీపీ, షుగర్‌పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో యూబీఐ రీజినల్ మేనేజర్ భాస్కర్, డిప్యూటీ ఆర్ఎం సుధాకర్‌రావు, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రోత్ మానిటరింగ్ కిట్ల అందజేత


అంగన్ వాడీ కేంద్రాలకు గ్రోత్ మానిటరింగ్ కిట్లను పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ

వల్లూరు : మహిళా శిశు సంక్షేమ శాఖ పని తీరు మెరుగుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని , ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి దృష్టి సారించి చిన్నారులు, బాలింతలకు మెరుగైన సేవలను అందిస్తోందని ఐసీడీఎస్ పీడీ ఎమ్ ఎస్ రాణి అన్నారు. వల్లూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) వారి సహకారంతో అంగన్ వాడీ కేంద్రాలకు గ్రోత్ మానిటరింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కృషికి తోడ్పాటుగా ఐవోసీ వారు సీఎస్ఆర్ ఇండియన్ ఆయిల్ ఆరోగ్యం నిధులతో జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న జిల్లాలోని 5 మండలాల పరిధిలోని 297 అంగన్ వాడీ కేంద్రాలకు బరువు, ఎత్తులను కొలవడానికి ప్రత్యేకంగా రూపొందించిన గ్రోత్ మానిటరింగ్ కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐవోసీ డిప్యూటీ జీఎమ్ ధర్మారావు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ సీఎస్ఆర్ ఆరోగ్య నిధుల ద్వారా అంగన్ వాడీల్లోని పిల్లలు, బాలింతలకు ఉపయోగకరంగా ఉండే గ్రోత్ మానిటరింగ్ కిట్లను అందించడం సంతోషంగా ఉందనిపేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మండల పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలకు గ్రోత్ మానిటరింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రా హోలిస్టిక్ హెల్త్ సొసైటీ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపీడీవో రఘునాథ్, ఈవోపీఆర్డీ ప్రసాద్, సీహెచ్‌వో వేణు గోపాల్, సూపర్‌వైజర్లు శ్రీదేవి, మేరీ విజయ కుమారి, అంగన్ వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ


నిఖిలాసంధ్య


ఆఫ్రిన్‌బాను


ఖానమ్


అక్షయ


జగదీష్ రెడ్డి


మేఘన

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ గ్రూపులో సరా ఖానమ్ 435 మార్కులు, ఆఫ్రిన్ బాను 435, మేఘన 433, రమ్యసాయి 431, విద్యమాధురి 430 సాధించారు. ఎంపీసీలో నిఖిలాసంధ్య 464 మార్కులు, హాసిని 463, కైలాస్ 463 మార్కులు సాధించారు.

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీకి సంబంధించి అక్షయ 987 మార్కులు, బృహతి 985, బార్గవి 982 మార్కులను సాధించగా ద్వితీయ ఇంటర్ ఎంపీసీకి సంబంధించి జగదీష్‌రెడ్డి 986, మేఘన 986, అంజలి లాస్యం 985, పవిత్రరెడ్డి 985, తేజ 984, ప్రణీతరెడ్డి 982, తేజేస్ 982 మార్కులను సాధించి తమ ప్రతిభను చాటారు. వీరిని డీజీఎం రామోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఏజీఎంలు చెన్నక్రిష్టారెడ్డి,వెంకటరామిరెడ్డి,ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి అభినందించారు.